# నాణ్యమైన పరికరాలను..

# ఉత్పత్తి చేసినప్పుడే కంపెనీకి పేరు

## - తక్కువ విద్యుత్‌తో ఎక్కువ ఉపయోగం ఉండేలా తయారు చేయాలి - హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి

హైదరాబాద్, మే 26 (కెఎన్ఎన్): విద్యుత్ వినియోగదారులకు తక్కువ విద్యుత్‌తో ఎక్కువ ఉపయోగపడేలా ఉండే పరికరాలను ఉత్పత్తి కేంద్రాలను తయారు చేయాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి సూచించారు. బేగంపేటలోని మారిగోల్డ్ హోటల్‌లో హెచ్‌పీఎల్ సంస్థ విద్యుత్ హెచ్చుతగ్గులను నియంత్రించడానికి ఉపయోగ పడేలా ఉండేలా కొత్తగా ఉత్పత్తి చేసిన వాల్యూ సర్క్యూట్ బ్రేకర్ (వీసీబీ)ని ఆయన ప్రారంభించిన అనంతరం పాల్గొన్న డీలర్లను ఉద్దేశించి మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన పరికరాలను అందించడంతోనే కంపనీకి మంచి పేరు వస్తుందన్నారు. ప్రజల్లో మంచి పేరు వచ్చేంత వరకు కష్టపడాలని, ఆ తర్వాత వద్దనకుండానే ఆ కంపనీ తయారు చేసిన వస్తువులకు డిమాండ్ పెరుగుతుందని అన్నారు. నేటి రోజుల్లో డబ్బులకన్నా నాణ్యతకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తుంచుకోవాలని అన్నారు. కంపనీలు తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ కావాలంటే విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. హెపీఎల్ కంపనీకి మంచి గుర్తింపు ఉందని కితాబు నిచ్చారు. 1956 లో ప్రారంభమైన హెచ్‌పీఎల్ ఉత్తరాదిలో తొమ్మిది కంపనీలను నెలకొల్పిందని, తెలంగాణలో ఒక కంపనీ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ ఉత్పత్తుల్లో అగ్రగామి కంపనీలలో హెచ్‌పీఎల్ ఒకటి అన్నారు. ప్రస్తుతం 1300 కోట్ల టర్నవర్‌తో 2700 అధీకృత డీలర్లతో హెచ్‌పీఎల్ మంచి లాభాలలో వినియోగదారుల మన్ననలను పొందిందన్నారు. హెచ్‌పీఎల్ ఉత్పత్తిలో ముందున్నా ప్రచారం చేసుకోవడంలో చాలా వెనుకబడి ఉందన్నారు. ప్రచార సాధనాలను అసలే ఉపయోగించుకోవడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనతో హైదరాబాద్ నగరం విశ్వనగరం వైపు అడుగులు వేస్తుందని అన్నారు. తెలంగాణ సాధించుకున్న ఐదారు నెలల్లోనే కోతలులేని విద్యుత్‌ను అందించగలిగామని, నూతన పరిశ్రమలు నెలకొల్పడానికి టీఎస్ ఐపాసు విధానంతో మంచి ఆదరణ లభిస్తుందన్నారు. అవినీతికి అస్కారం లేకుండా సీఎం కేసీఆర్ ఆలోచనలతో రూపొందించిన టీఎస్ ఐపాస్ విధానంతో పరిశ్రమలు నెలకొల్పడానికి సీఎంకు దరఖాస్తు చేసుకున్న 15 రోజుల నాటికి అన్ని అనుమతులు నయా పైస ఖర్చు లేకుండా జారీ చేస్తున్నామని తెలిపారు. ఈ విధానం ప్రపంచంలో ఎక్కడా లేదని అన్నారు. ఈ విధానంతో ఇప్పటికే 50కి పైగా పరిశ్రమలు వచ్చాయని, మరో 150 పరిశ్రమలు రానున్నాయని తెలిపారు. వీటి ఏర్పాటు వల్ల 50వేల మందికి ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో ఇతర దేశాలు, రాష్ట్రాల ప్రతినిధులు ప్రశంసలు పొందుతున్నామని తెలిపారు. ఐటీశాఖ మంత్రి కేటీఆర్ విదేశాలలో పర్యటిస్తు వివిధ కంపెనీలను ఆకర్షిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపనీ జీఎం పి.ఫణికుమార్, ప్రతినిధులు శేఖర్‌రెడ్డి, మునికుమార్, సుదర్శన్‌రెడ్డి, ఎం.ఎన్,మూర్తి, హన్మంతరావు, సత్యనారాయణ, క్లాస్ వన్ కాంట్రాక్టర్లు నక్క యాదగిరి, కె.శ్రీనివాస్, జీ.సీ.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతున్న హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి